మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక
కావలెను
'మనం' తెలుగు దినపత్రికకు ఈ దిగువ పేర్కొన్న సర్కిల్స్ పరిధిలో విలేకరులుగా పనిచేసేందుకు ఉత్సాహవంతులు కావలెను. చక్కటి రాత, తెలుగుభాషపై పట్టు ఉండి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు కోరబడుతున్నవి.
కావలసిన ప్రాంతాలు :
కరీంనగర్ జిల్లా : సైదాపూర్, గంగాధర, గన్నేరువరం, హుజురాబాద్ ఆర్.సి. రామడుగు
జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలలో స్టాఫ్ రిపోర్టర్లు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక
ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యాలయం
సాయికృష్ణ థియేటర్ ఎదురుగా
భగత్‌నగర్, కరీంనగర్.
పూర్తి వివరాలకై సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
సెల్ : 83339 98076


# మనం
## కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్
బుధవారం | 6 | సెప్టెంబర్ | 2023 | పేజీలు : 9

### రాజారాంపల్లిలో విజృంభిస్తున్న వైరల్ జ్వరాలు

### జ్వరం వస్తే 15రోజుల వరకు తగ్గని పరిస్థితి

### సొంత వైద్యం వద్దని హెచ్చరిస్తున్న డాక్టర్లు



# వణికిస్తోన్న విష జ్వరాలు




వెల్గటూర్,సెప్టెంబర్ 05(మనం న్యూస్):ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు, వాతావరణ మార్పులతో గ్రామంలో సీజనల్ వ్యాధులు, డెంగ్యూ జ్వరాలతో ఎండపల్లి మండలంలోని రాజారాంపల్లి గ్రామం మంచాన పట్టింది.

గ్రామంలో ఇంటికొకరు జ్వరాల బారిన పడ్డారంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు గ్రామంలో రహదారుల వెంబడి ఎక్కడికక్కడ నీరు నిలవడం, డ్రైనేజీ పూడికతీత ,పారిశుధ్య లోపంతో డెంగ్యూ జ్వరాలు చాప కింద నీరులా విస్తరిస్తుంది. ఇప్పటికే గ్రామంలో సుమారు 20 మంది డెంగ్యూ పాజిటివ్ కేసులతో కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ జేబులు గుల్ల చేసుకుంటున్నారు. వార్డు సభ్యుల దంపతులు కూడా జ్వరాల బారిన పడి కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా పాలక వర్గం గ్రామంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి,నిర్ధారణ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేయాలని,డ్రైనేజీ లలో పూడిక తీత, చెత్త తొలగింపు,నీటి నిలువలపై ప్రజలకు అవగాహన కల్పించి, సాయంత్రం వేళల్లో ఫాగింగ్ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## మంత్రి గంగుల కుటుంబ సభ్యులకు ఇడి నోటీసులు

### శ్వేతా గ్రానైట్ ఫెమా నిబంధనలు ఉల్లంఘిచినట్లుగా గుర్తింపు



కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 5 (మనం న్యూస్): రాష్ట్ర పౌరసరఫరాలు, బిసి సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ కుటుంబ సభ్యులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు మంగళవారం నోటీసులు జారీ చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు చెందిన శ్వేతా గ్రానెట్స్ ఫెమా నిబంధలు ఉల్లంఘించినట్టుగా గుర్తించిన అధికారులు నోటీసులు అందించారు. గతేడాది నవంబర్‌లో శ్వేతా ఏజెన్సీలో సోదాలు జరిపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే చైనాకు గ్రానైట్ ఎగుమతి చేసిన సందర్భంలో అవకతవకలు జరిగినట్టుగా నిర్ధారణకు వచ్చినట్టుగా తెలుస్తోంది. 7.6 లక్షల క్యూబిక్ మీటర్ల గ్రానైట్ అక్రమంగా తరలించినట్టుగా ఈడీ అధికారులు గుర్తించినట్టుగా తెలుస్తోంది. 4.8 కోట్ల రూపాయల మేర ఉల్లంఘనలకు పాల్పడినట్టుగా గుర్తించినట్టుగా సమాచారం. హవాలా మార్గంలో డబ్బు బదిలీ అయినట్టుగా తేల్చారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులో 50 కోట్ల రూపాయల వరకు పెండి గ్‌లో ఉండగా 3 కోట్లు మాత్రమే చెల్లించినట్టుగా ఈడీ అధికారులు గుర్తించారు.

## ఎల్‌ఎండి గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

తిమ్మాపూర్, సెప్టెంబర్ 5 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని లోయర్ మానేరు డ్యామ్‌లోకి నీటి ఉధృతి పెరగడంతో మంగళవారం సాయంత్రం వరకు ఎనిమిది గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదిలారు. 24 టిఎంసిల సామర్థ్యమున్న ఈ జలాశయంలోకి గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మిడ్ మానేరు, మోయతుమ్మెద వాగుల నుండి వరద నీటి ఉధృతి నిరంతరంగా పెరుగుతూ 20 టిఎంసిలకు పైగా నీరు చేరింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ముందు జాగ్రత్త చర్యగా ఎనిమిది గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. వర్షాలు నిరంతరంగా కొనసాగుతుండడం వల్ల మరింత నీటిని తరలించేందుకు అవసరమైన పక్షంలో మరిన్ని గేట్ల ద్వారా నీటిని విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.



## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



జమ్మికుంట, సెప్టెంబర్ 05(మనం న్యూస్): జమ్మికుంట పట్టణంలోని చాణిక్య డిగ్రీ, పీజీ, కళాశాలలో మంగళవారం రోజున డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు, కళాశాల ప్రిన్సిపాల్, వి వంశీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అంతేకాకుండా సర్వేపల్లి చేసిన కృషిని వివరిస్తూనిరుపేద కుటుంబానికి చెందిన సర్వేపల్లి రాధాకృష్ణ అంచలంచలుగా ఎదిగి, ఉపరాష్ట్రపతి, స్థాయి నుండి రాష్ట్రపతి వరకు ఎదిగారని కొనియాడారు, విద్యార్థినీ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు పొందాలని ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వంశీకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సిహెచ్ శివ, అధ్యాపక బృందం, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ముత్తారం సర్పంచ్ తుటి రజిత రఫీ ఆధ్వర్యంలో

## ఉపాధ్యాయులకు సన్మానం



ముత్తారం,సెప్టెంబర్ 05 మనం న్యూస్ ః ముత్తారం మండలంలోని సరస్వతి విద్యాలయం ఉపాధ్యాయులను సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి దినోత్సవం సందర్భంగా మాజీ మంత్రి మంథని శాసనసభ్యులు ఏఐసిసి కార్యదర్శి దుద్దిల్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు ముత్తారం సర్పంచ్ తూటి రజిత రఫీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల ను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ ముత్తారం గ్రామశాఖ అధ్యక్షులు అనుము స మ్మయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొల్నేని బుచ్చంరావు ,మల్యాల శంకర్,జక్కుల రమేష్,తాడవేన మహేందర్,అనవేన ఓదెలు, చల్ల సదయ్య, అనుము లక్ష్మణ్,పారనంది శ్రీను,పారనంది సది,కాంగ్రెస్ పార్టీ ఓడేడు గ్రామశాఖ బిసి సెల్ అధ్యక్షుడు నరేడ్ల సదానందం, సీనియర్ నాయకులు లక్కం ప్రభాకర్,నిమ్మతి ఆశాలు,కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అనాథలైన పిల్లలకు ఆర్థిక సహాయం అందజేత



వీణవంక-సెప్టెంబర్ 5 (మనంన్యూస్): మండలంలోని బొంతుపల్లి గ్రామానికి చెందిన శ్రీరాముల సమ్మయ్య ఇటీవల మృతి చెందాడు. మృతుని భార్య సంవత్సరం క్రితమే మృతిచెందడంతో అనాథలు గా మారిన వారి పిల్లలు ఇద్దరు కూతురు శ్రీరాముల రమ్య , కుమారుడు శ్రీరాముల రాజ్‌కుమార్ లను మంగళవారం చల్లూరు గ్రామ యూత్ అసోసియేషన్ వారు పరామర్శించి ఆర్థిక సహాయంగా పదివేల ఐదువందల రూపాయలు అందజేశారు.

# ఘనంగా గాయత్రి విద్యాసంస్థల్లో టీచర్స్‌డే వేడుకలు

**సర్వేపల్లి రాధాక్రిష్ణన్ జయంతి వేడుకలు**

**సమాజ అభివృద్ధిలో ముఖ్య భూమిక పోషిస్తున్న ఉపాధ్యాయులు**

**గురువులేని విద్య గుడ్డి విద్య**

**గాయత్రి విద్యాసంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్**

పెద్దపల్లి, సెప్టెంబర్-05(మనం ప్రతినిధి): గురువ లేని విద్య .. గుడ్డి విద్య అని, సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయులు ముఖ్య భూమిక పోషిస్తున్నారని గాయత్రి విద్యా సంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లి పట్టణం లోని గాయత్రి విద్యాసంస్థలలో మంగళవారం డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జన్మదినం సందర్భంగా టీచర్స్‌డేని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గాయత్రి విద్యాసంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్ సర్వేపల్లి రాధాక్రిష్ణ చిత్రపటానికి పూలమాలవేసి ఉపాధ్యాయ బృందానికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గాయత్రి విద్యానికేతన్, గాయత్రి జూనియర్ కళాశాల, గాయత్రి డిగ్రీ,ఫీజీ కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి గాయత్రి విద్యా సంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్ మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి





రాధాకృష్ణ విద్యార్థినీ, విద్యార్థులకు మరియు అధ్యాపక బృందానికి ఆదర్శప్రాయుడని, ప్రపంచం గర్వించదగినటువంటి గొప్పతత్వ శాస్త్రవేత్తని కొనియాడారు. గురువులేని విద్య గుడ్డి విద్య అని, విద్యార్థులంతా గురువు మాట జవదాటకుండా, వారు చెప్పిన విషయాలను తూచతప్పకుండా పాటించినట్లయితే విద్యార్థుల భవిష్యత్ బంగారుమయం అవుతుందన్నారు. మన జీవితంలో మన ఉన్నతికి తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయుల పాత్ర కూడా చాలా కీలకమని అన్నారు. సమాజ అభివృద్ధిలో ముఖ్య భూమిక పోషిస్తున్న ఉపాధ్యాయులను గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులను ఆయా తరగతుల విద్యార్థులు సన్మానం చేసి కానుకలు ప్రధానం చేశారు. ఈకార్యక్రమంలో కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్, రజియుద్దీన్, పిఇటీనవీన్, స్రవంతి, నాసియా తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో జవాబుదారితనంతో ఉండాలి

## కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 5 (మనం న్యూస్)ః క్రమబద్ధీకరణ ఉత్త ర్వులు తీసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధి నిర్వహణలో జవాబుదారితనంతో ప్రవర్తించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నా రు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కలెక్టర్ సమావేశ మందిరంలో బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు దుర్గం చిన్నయ్యతో కలిసి బెల్లంపల్లి నియోజకవర్గంలోని 7 మండలాలకు సంబంధించి 4 సంవత్సరాలు పూర్తి చేసుకున్న అర్హత గల జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు నియామకపు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నియామకపు ఉత్తర్వులు అందుకున్న పంచాయతీ కార్య దర్శులు తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహిం చాలన్నారు. సర్వీసు క్రమబద్ధీకరణతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ విధి నిర్వహణలో పంచాయతీ కార్యదర్శులు రాష్ట్ర స్థాయిలో అవార్డులను గెలుచుకోవడం అభినందనీయమని, ఇదే



స్ఫూర్తితో పని చేయాలని, ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లయితే తమకు తెలియ జేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు, మండల పంచాయతీ అధికారులు శ్రీపతి బాపు, వేదాల శ్రీనివాస్, కొమ్మెర సతీష్ కుమార్, 15 గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెలు పంపిణీ చేసిన సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు

రామగిరి,సెప్టెంబర్ 05 మనం న్యూస్ ః రామగిరి మండలం ర త్నాపూర్ గ్రామంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అందించిన గొర్రెలను పంపిణీ చేయడం జరిగిందని సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు అన్నారు. మంగళవారం సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావుతో పాటు మండలల పశువైద్యాధికారి యారవ దుర్గాప్ర సాద్‌లు 6 గురికి లబ్ధిదారులకు గొర్రెలను అందజేశారు. గతంలో రత్నాపూ ర్‌లో మొదటి ఫేస్ కింద 65 యూనిట్ల గొర్రెలను అందజేయడం జరిగిం దన్నారు. రెండవ విడతలో 72 మంది లబ్ధిదారులు ఉండగా 56 మంది లబ్ధిదారులు రూ.43,750 చొప్పున డిడిలు చెల్లించారు. దీనిలో ప్రభుత్వం రూ.1,31,250 లు సబ్సిడీ క్రింద చెల్లించింది. దీనిలో ఒక్కొక్క లబ్ధిదారునికి 20 గొర్రెలు,1 పొట్టేలును అందించడం జరిగింది. లబ్ధిదారులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణ జిల్లా నుండి జగ్గయపేట నుండి వీటిని కొనుగోలు చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్ సహకారంతో లబ్ధిదారులు జున్నువాలా కుమార్,జున్నువాల కత్తులు,ఉడుత కొమురయ్య,మేకల రవి,గెల్లు ఓదెలు,జక్కుల మహేష్‌లకు ఈ గొర్రెల పథకం అందించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వెటర్నరీ



అసిస్టెంట్ అత్తే మల్లికార్జున్,గెల్లు శేకర్,మెడగొండ కొమురయ్య, జక్కుల చందన్,తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధిలో

# గ్రామ సంఘ సహాయకుల కృషి అభినందనీయం

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్

మంచిర్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 5 (మనం న్యూస్): పొదుపు సంఘాల ద్వారా మహిళలను సంఘటితం చేస్తూ, మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధిలో గ్రామ సంఘ సహాయకుల కృషి అభినందనీయమని ప్రభుత్వ విప్, చెన్నూర్ నియోజకవర్గ శాసనసభ్యులు బాల్క సుమన్ అన్నారు. ప్రభుత్వం గ్రామ సంఘ సహాయకుల వేతనం ఎనిమిది వేల రూపాయలకు పెంచిన సందర్భంగా మంగళవారం సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లాలోని 468 మంది గ్రామ సంఘ సహాయకులు జిల్లా స్థాయి కృతజ్ఞత సభలో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు బోర్లకుంట వెంకటేష్ నేత, బెల్లంపల్లి శాసనసభ్యులు దుర్గం చిన్నయ్యతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, మంచిర్యాల శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్రావుతో కలిసి హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలో పేదరిక నిర్మూలన కోసం ప్రత్యేకం కృషి చేస్తున్నామని, మహిళలు సంఘటితంగా ఆర్థిక పరమైన నైపుణ్యాభివృద్ధి చెందడంతో పాటు ఆర్థిక స్థిరత్వం ఉండే విధంగా కుటుంబాల సంక్షేమం కోసం ముందుంజలో ఉండేందుకు కృషి చేస్తుందని, ప్రభుత్వానికి, మహిళ లకు అనుసంధానం కల్పించడంతో పాటు ప్రభుత్వ పథకాలు, ప్రోత్సాహ కాలు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. పొదుపు సంఘాల్లోని మహిళలను సంఘటితం చేసి వారిని చైతన్య పరుస్తూ సమన్వయకర్తలుగా బాధ్యతలు నిర్వహిస్తున్న గ్రామ సంఘ సహాయకుల



సేవలను గుర్తించి రక్షాబంధన్ కానునగా వేతనం పెంచడం జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా సెర్ఫ్ పరిధిలో 4 లక్షల 31 వేల 402 మంది మహిళా సంఘాలు పని చేస్తున్నాయని, ఇందులో 46 లక్షల 21 వేల 272 మంది మహిళా సభ్యులు ఉన్నారని తెలిపారు. మహిళా సంఘాలకు రుణాలు అందించి వారు ఆర్థికంగా ఎదగడంలో గ్రామ సంఘ సహాయకుల పాత్ర కీలకమైందని అన్నారు. గతంలో 6 వేల రూపాయలు చెల్లించే వేతనాన్ని 2021లో ప్రభుత్వం 30 శాతం పెంచడంతో 6 వేల 900 రూపాయలు కాగా రక్షాబంధన్ కానుకగా 1 వేయి 100 రూపాయలు పెంచడంతో 8 వేల రూపాయలు చెల్లించడంతో రాష్ట్రంలో 17 వేల 608 మంది గ్రామ సంఘ సహాయకులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. యూనిఫాం నిధులతో పాటు ప్రతి 3 నెలలకు అమలవుతున్న రెన్యూవల్ విధానాన్ని ఏడాదికి పెంచి, జీవిత భీమా అందించడంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి డ్రెస్ కోడ్ కొరకు 2 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరుగుతుందని తెలిపారు. నోట్ల రద్దు, కరోనా విపత్కర పరిస్థితులలో ప్రజా సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందని, స్వరాష్ట్రంలో హోంగార్డులు, ఆశ వర్కర్లు, అంగన్వాడీల వేతనాలు పెంచడం జరిగిందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సమ్మక్క-సారలమ్మ మహిళ భవనాలను నిర్మిస్తున్నామని, అభివృద్ధి, సంక్షేమం మహిళల్లోకి తీసుకువెళ్ళేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 468 గ్రామ సంఘ సహాయకుల వేతనం 8 వేల రూపాయలకు పెంచినందున 10 లక్షల రూపాయలు ప్రతి అదనంగా చెల్లించడం జరుగుతుందని, గ్రామ సంఘ సహాయకులు మరింత ఉత్సాహంతో పని చేయాలని తెలిపారు. గ్రామీణ వ్యవస్థలో మహిళలను అన్ని రంగాలలో మరింత ముందుకు తీసుకువెళ్ళేందుకు, ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో గ్రామ సంఘ సహాయకుల పాత్ర ఎనలేనిదని అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి. శేషాద్రి, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్, జెడ్.పి.టి.సి.లు,గ్రామ సంఘ సహాయకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు వినియోగం నైతిక బాధ్యత

### మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 5 (మనం న్యూస్): ప్రజాస్వామ్య బద్ధంగా ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత అని సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ తెలిపారు. స్థానిక మూడో వార్డులో మంగళవారం నిర్వహించిన ఈవిఎమ్, వీవీపాట్ అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా కళ మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా సంక్రమించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని కలిగి, ఆదర్శవంతమైన పరి పాలన సాగిస్తున్న గొప్ప దేశం భారతదేశమన్నారు. రాజ్యాంగబ ద్ధంగా ప్రతి పౌరుడికి స్వేచ్ఛను కలిగిస్తూ ఓటింగ్ పద్ధతి ద్వారా నాయకులను ఎన్నుకొని, వారి ద్వారా భారత దేశంలో పరిపాలన సాగించబడుతుందన్నారు. మారుతున్న కాలం ప్రకారం అధునాతన పద్ధతుల్లో ఇవిఎం మిషన్ల ద్వారా ఎక్కడ కూడా ఎలాంటి పొర పాట్లకు తావు లేకుండా నాయకులను ఎన్నుకుంటున్నామన్నా రు. అంతేకాకుండా 2014లో భారత ప్రభుత్వ ఎన్నికల కమిషన్ వారు ఓటరుకు వారు ఓటు వేసినది నిర్ధారించుకోవడం కోసం ఓటింగ్ వ్యవస్థలో మరింత పారదర్శకతను పెంచేలా ఓటర్ వెరిఫైబుల్




పేపర్ ఆడిట్ ట్రయల్ అనే విధానాన్ని ప్రవేశపెట్టి విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. అదే స్ఫూర్తితో రాబోయే శాసనసభ, లోక్ సభ ఎన్నికలతో పాటు మిగతా ఎన్నికలలో ఈ వివిపాట్ విధానాన్ని అమలు చేయనున్నారని ఆమె వివరించారు. ఈ పద్ధతి ప్రజల్లో ఎన్నికల పట్ల మరింత విశ్వసనీయతను పెంచేలా తోడ్పడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

## చెవిలో పూలతో ఎన్ హెచ్ఎంల నిరసన




మంచిర్యాల, సెప్టెంబర్ 5 (మనం న్యూస్): తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఎన్ హెచ్ఎంల నిరసన దీక్ష మంగళ వారంతో ఆరవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఎన్హెచ్ఎంలు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద చెవిలో పూలు పెట్టుకుని వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్హెచ్ఎం మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి దేవనబోయిన బాపు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాస్, మంచిర్యాల జిల్లా సీ పీ ఐ కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మంచిర్యాల జిల్లా టౌన్ ఏఐటీయూసీ కౌన్సిలర్ కళిందర్, దేవీ పోచన్న పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు



తిమ్మాపూర్, సెప్టెంబర్ 5 (మనం న్యూస్): మానకొండూరు నియోజకవర్గానికి చెందిన ఇతర పార్టీలకు చెందిన ప్రజాప్రతిని ధులు, నాయకులు, కార్యకర్తలు కరీంనగర్ డిసిసి అధ్యక్షులు కవ్వం పల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాదులో టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరా రు. నియోజకవర్గంలోని ఇల్లంతకుంట మాజీ ఎంపీపీ గుడిసె ఐల య్య, సీనియర్ నాయకులు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, కేశవరెడ్డి జవా రిపేట సర్పం చ్ అన్నాడి కరుణ రవీందర్ రెడ్డి, పెద్దలింగాపూర్ ఎంపీటీసీ కరివేద స్వప్న కరుణాకర్ రెడ్డి, రేపాక ఎంపీటీసీ కథ సుమలత మల్లేశం, మాజీ సర్పంచ్ యాదగిరి గౌడ్ సింగిల్ విండో డైరెక్టర్ చల్ల నవీన్ రెడ్డి, కేతిరెడ్డి నవీన్ రెడ్డి, శరత్ రెడ్డి, రవీందర్ రెడ్డి, సుమంత్ రెడ్డి, కందికట్కూర్ గ్రామ నాయకులు భూమల్ల మల్లయ్య, రోషాలు, మల్లేశం తదితరులు నాయకులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి మాజీ ఎంపీపీ ఒగ్గ దామోదర్, ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాఘవ రెడ్డి, బెజ్జంకి మండల అధ్యక్షులు రత్నాకర్ రెడ్డి, నాయకులు రాజేందర్ రెడ్డి, పసుల వెంకట్, చందు, సాగర్, తిరుపతి, పాల్గొన్నారు.

## రసమయి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరికలు



తిమ్మాపూర్, సెప్టెంబర్ 5 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా మానకొండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రసమయి బాలకి షన్ సమక్షంలో ఇల్లంతకుంట మండలంలోని తాళ్లపల్లి, పత్తికుంటపల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అందిస్తున్న సంక్షేమ పథకా లతో పాటు మానకొండూర్ నియోజక వర్గంలో ఎమ్మెల్యే బాలకిషన్ చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులమై గులాబీ గూటికి చేరుతున్న ట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా జడ్పి వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఇల్లంతకుంట మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు పల్లె నర్సింహా రెడ్డి, సర్పంచులు, ఎంపిటీసీలు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దేది గురువులే

### అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి

### అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు

కరీంనగర్, సెప్టెంబర్ 5 (మనం న్యూస్)ః విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్ది సమాజానికి ప్రయోజకులుగా అందించేది ఉపాధ్యాయులని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. నగరంలోని ప్రైవేటు వేడుక మందిరంలో 'అల్ఫోర్స్ గురుపూజోత్సవ్ – 2023' వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన నరేందర్ రెడ్డి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిర్దేశించిన మార్గాలను విద్యార్థులు అనుసరించాలన్నారు. పురాతన కాలంలో గురువులకు సమాజంలో ప్రత్యేక స్థానం ఉండేదని, గురువంటే భయముండేదన్నారు. కాని నేటి కాలంలో వెలువడుతున్న పలు మార్పులకు, ఉపాధ్యాయులకు విలువ కరువైందని, వారు బోధిస్తున్న విషయాలను నిర్లక్ష్యంగా అమలు చేయడం ద్వారా సమాజ అభివృద్ధి ఆమడ దూరంలో ఉంటుందని తెలిపారు. విద్యార్థులు గురువులను ఎల్లప్పుడు గుర్తుపెట్టుకొని వారి గొప్పతనాన్ని, అంకిత భావాన్ని ఆదర్శంగా తీసుకొని కష్టపడి ఘనవిజయాల వైపు పయనించాలని నరేందర్ రెడ్డి కోరారు.వేడుకలను పురస్కరించుకొని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లోని ఉపాధ్యాయులకు వినోదా్మక కార్యక్రమాలను గమ్మత్తుగా నిర్వహించారు. 1




మినెట్, క్యారమ్స్, చెస్, మ్యూజికల్ చేర్, హైడ్ సీక్, అప్ డౌన్, లెమన్ స్పూన్ నిర్వహించారు. పుష్పగుచ్ఛాలతో పాటు జ్ఞాపికలను అందించి శుభాభినందనలు తెలియజేశారు. విద్యారంగానికి ఎనలేని కృషి చేస్తు సంచలనాత్మక ఫలితాలు సాధిస్తున్న డాక్టర్ వి. నరేందర్ రెడ్డికి ఉపాధ్యాయులందరు జ్ఞాపికను, పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి




రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 5 (మనం న్యూస్): జిల్లా కేంద్రంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) సిరిసిల్ల బాధ్యులు తెలిపారు. మంగళవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాలను వెల్లడించారు. జిల్లా ఇస్కాన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9 గురువారం సిరిసిల్ల పట్టణంలోని పద్మనాయక కళ్యాణ పండపంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 6:30 గంటలకు అభిషేకం, దర్శన హారతి, గురుపూజ అనంతరం 9.30 గంటలకు అఖండ హరినామ సంకీర్తన ఉంటుందన్నారు. 10 గంటలకు అన్నదాన సేవ అనంతరం రాజాభోగ సమర్పణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం నుండి సాయంత్రం వరకు భక్తులకు స్వామి వారి దర్శనం కల్పిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ వేడుకల సందర్భంగా సుమారు ఏడు వేల మంది భక్తులకు భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. బృందావనాన్ని తలపించే రీతిన జన్మాష్టమి ఉత్సవాలు ఉంటాయని, జిల్లా వాసులు శ్రీకృష్ణ భగవానుడిని దర్శించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఇస్కాన్ గురువులు ప్రాణనాథ అచ్యుతదాస్, భావమయ నిత్యానందదాస్, పరమేశ్వరి మహారాణి తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో చేరిన యువకులు



శంకరపట్నం, సెప్టెంబర్ 5 (మనం న్యూస్)ః మండలంలోని ఆముదాలపల్లి గ్రామానికి చెందిన యువకులు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో మంగళవారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యులు లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గంట మహిపాల్, సర్పంచ్ బత్తుల మానస, ఎంపిటిసి సభ్యులు పెద్ది శ్రీనివాస్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు ధర్మేష్, ఆముదాలపల్లి ఉపసర్పంచ్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి.. మరొకరికి గాయాలు



హుజురాబాద్ రూరల్, సెప్టెంబర్ 5 (మనం న్యూస్)ః హుజురాబాద్ మండలం తుమ్మనపల్లి గ్రామం వద్ద వరంగల్–కరీంనగర్ ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. పంచాయితీ రాజ్ శాఖ డిఇఇది పేర్కొంటూ స్టిక్కర్ ఉన్న టిఎస్03ఇజడ్ 9704 నంబరు గల ఎర్టిగా వాహనం, తుమ్మనపల్లి గ్రామం వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో ఎర్ర లింగయ్య(54) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ వాహనంపై ప్రయాణిస్తున్న మరో వ్యక్తి సమ్మయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## రోగులకు బ్రెడ్ల పంపిణీ




చిగురుమామిడి, సెప్టెంబర్ 5 (మనం న్యూస్)ః లయన్స్ క్లబ్ 320 జి గవర్నర్ హనుమాన్ల రాజిరెడ్డి, పాస్ట్ గవర్నర్ అనంతుల శివప్రసాద్‌ల పుట్టినరోజు సందర్భంగా కరీంనగర్ లయన్స్ క్లబ్, కంటి వెలుగు, చిగురుమామిడి లయన్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక పిహెచ్‌సిలోని రోగులకు బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిగురుమామిడి క్లబ్ ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి, కంటి వెలుగు సెక్రటరీ తిప్పారపు శ్రీనివాస్, స్థానిక జడ్పిటిసి సభ్యులు గీకురు రవీందర్ , మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ధర్మనాయక్ , డాక్టర్లు ప్రత్యూష, నిర్మల , సందీప్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు పాడి గేదె మృతి



చిగురుమామిడి, సెప్టెంబర్ 5 (మనం న్యూస్) : పిడుగు పడి గేదె మృతి చెందిన ఘటన కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మెడబోయిన కుమార్ అనే యువ రైతుకు చెందిన పాడి గేదెపై పిడుగు పడి మృత్యువాతపడింది. దీంతో ఆ రైతు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ పాలు పిండుకొని పొలం వద్ద కట్టేసిన గేదెపై ఉదయం 7:30 గంటలకు పిడుగు పడి మృతి చెందిందని తెలిపారు. 80 వేల రూపాయల అప్పుచేసి కొనుగోలు చేసిన పాడి గేదె మృతి చెందిందని తెలుపుతూ భోరున విలపించాడు. బాధిత రైతును ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కరీంనగర్ డెయిరీ చైర్మన్ తాళ్లపల్లి సంపత్ గౌడ్ కోరారు.రైతులు వ్యవసాయ పొలాల వద్ద వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.భారీ వర్షాల వల్ల ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లయితే వెంటనే రెవిన్యూ అధికారులను,పోలీసులను గాని సంప్రదించాలని కోరారు.

## భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### తప్పనిసరైతేనే బయటకు రావాలి: పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడు



కరీంనగర్ క్రైం, సెప్టెంబర్ 5 (మనం న్యూస్)ః భారీ వర్షాలు కురుస్తోన్న దృష్ట్యా కరీంనగర్ కమిషనరేట్ లోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తగిన జాగ్రత్తలతో అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకి రావద్దని కరీంనగర్ పోలీస్ కమీషనర్ ఎల్ .సుబ్బారాయుడు ఒక ప్రకటనలో సూచించారు. పరివాహక, లోతట్టు ప్రాంతాలకు చెందిన ప్రజలకు సహాయం అందించేందుకు పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని తెలిపారు. కమిషనరేట్ పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, అధికారుల సూచనలను పాటిస్తూ పోలీసులకు శాఖకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లోతట్టు ప్రాంతాలకు చెందిన ప్రజలను అప్రమత్తం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. భారీ నుంచి అతి భారీ వర్షాల ఉన్న దృష్ట్యా లోతట్టు ప్రాంతాలలోని వారు భద్రత దృష్ట్యా సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాలని, వర్షానికి ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మట్టి ఇండ్లు, శిథిలావస్థ లో వున్న ఇండ్లు కూలిపోయే అవకాశం ఉంటుందని అందులో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తక్షణ సహాయం కోసం కు సంబంధిత అందుబాటులోని అధికారులకు గానీ, డయల్ 100 కు గానీ సమాచారం ఇవ్వాలని కోరారు. పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న చెరువులు, కుంటల నీటి ప్రవాహం గురించి ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుంటూ ప్రత్యక్షంగా వెళ్లి పర్యవేక్షించాలని సిపి సూచించారు. రోడ్ల పై గల మ్యాన్ హోల్స్ కు దూరంగా నడవాలని, ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు, వాగులు, రిజర్వాయర్లు, చెరువుల వద్దకు వెళ్ళరాదని, ప్రవాహం లో చేపలు పట్టే ప్రయత్నం చేయరాదని ఆయన ప్రజలకు సూచించారు.

## సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్ల ధర్నా



చిగురుమామిడి, సెప్టెంబర్ 5 (మనం న్యూస్)ఃరాష్ట్ర ప్రభుత్వం తమకు 18వేల కనీస వేతనం అందించడంతో పాటుగా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీలత మాట్లాడుతూ తమ న్యాయమైన కోర్కెలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమ్మెకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోఆశ యూనియన్ మండల అధ్యక్షురాలు నాగవెల్లి పద్మ, కార్యదర్శి పెద్దపెల్లి శోభ, నాయకులు అంజలి, సరోజన, మంజుల కమల, సుగుణ,శోభ, మంజుల, స్రవంతి, పుష్ప, నాగరాణి, సాహిదబేగం తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



కరీంనగర్, సెప్టెంబర్ 5 (మనం న్యూస్)ః జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ , పీజీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మంగళవారం మొదటి ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదిన సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి, ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్.ఆర్.గోపికృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని తెలియజేస్తూ, ఉపాధ్యాయ వృత్తి నుండి భారత దేశ మొదటి ఉపరాష్ట్రపతిగా , రెండవ రాష్ట్రపతిగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశానికి ఎనలేని సేవలందించారని కొనియాడారు. ప్రతి వ్యక్తి జీవితంలో తల్లిదండ్రుల తర్వాత గురువులదే ప్రధాన పాత్ర అని కొనియాడుతూ ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయులు సూచించిన మార్గంలో నడుస్తూ,ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏసిఓ సంపత్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్. రాపోలు గోపికృష్ణ, కచ్చు సతీష్ కుమార్ ,వివిధ విభాగాధిపతులు, అధ్యాపక బృందం, ఏ.ఓ. శ్రావణ్ కుమార్, బి.రామేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# వీధి వ్యాపారులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

## మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్ రావు



జమ్మికుంట, సెప్టెంబర్ 5 (మనం న్యూస్): పట్టణంలోని వీధి వ్యాపారులు రుణాలను సద్వినియోగం చేసుకొని వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కెళ్ళపల్లి రాజేశ్వర్ రావు అన్నారు.పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ అధ్వర్యంలో పట్టణ ప్రగతి స్వానిధి సే సమృద్ధి రుణాలు పొందుతున్న వీధి వ్యాపారులకు లబ్ధి చేకూర్చేందుకు ఏర్పాటు చేసిన సామాజిక ఆర్థిక శిబిరం రాజేశ్వర్ రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో స్వానిధి సే సమృద్ధి రుణాలు పొందుతున్న వ్యాపారులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, బ్యాంక్ మేనేజర్లు దొరస్వామి నాయుడు, రాకేశ్, సిఎల్ఆర్పి లు,ఆర్పీ లు,విధి వ్యాపారులు పాల్గొన్నారు.



# పారమిత పాఠశాలలలో ఉపాధ్యాయ దినోత్సవ సంబురాలు

కరీంనగర్,సెప్టెంబర్ 05( మనం న్యూస్): స్థానిక నగరం లోని పారమిత ఉన్నత పాఠశాల, పారమిత హెరిటేజ్, ఎక్స్ట్రొరిక , ఐరీష్ పాఠశాలలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి . వేడుకలను పారమిత పాఠశాలల అధినేత డా ఇ. ప్రసాదరావు జ్యోతి ప్రజ్వలన చేసి చేసి ప్రారంభిచారు. ఇట్టి కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, విన్యాసాలు మంత్ర ముగ్ధులను చేశాయి. ప్రసాదరావు మాట్లాడుతూ అన్ని వృత్తులలో కెల్లా ఉపాధ్యాయ వృత్తి అతి పవిత్రమైనది దేశ భవిష్యత్తును మార్చే ఒకే ఒక్క శక్తి ఉపాధ్యాయునిదేనన్నారు. ఈ సంధర్భంగా విద్యార్థులు స్వయంగా ఉపాధ్యాయ ఉపాధ్యాయులుగా విదులు నిర్వర్తించారు. ఈ సంధర్భంగా విద్యార్థులు వారి వారి అనుభవాలు పంచుకుంటూ ఉపాధ్యాయ వృత్తి యొక్కప్రాధాన్యతను, విలువలను వారి వారి మాటల్లో పంచుకున్నారు. ఇట్టి కార్యక్రమంలో పారమిత విద్యా సంస్థల చైర్మన్ డాఐఐఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్ రావు, వినోదరావు, వి.యు.ఎం. ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాద్యాయు లు బాలాజీ, ప్రశాంత్, కవిత, రితేష్ మెహత , శ్రీకర్, శర్మిష్ట , సమన్వయకర్తలు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కృష్ణవేణిలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



రామగిరి,సెప్టెంబర్ 05 మనం న్యూస్ ః రామగిరి మండలం కల్వచ్చెర్ల గ్రామంలోని స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో మంగళవారం డా.సర్వేపల్లి.రాధా కృష్ణన్ జయంతి సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలని నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులు అందరు ఉపాధ్యాయ వేషధారణలో వివిధ తరగతులకు పాఠాలు బోధించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తిరపతిరెడ్డి,ప్రిన్సిపాల్ బర్ల శ్రీనివాస్, డెరెక్టర్స్ శ్రీధర్‌బాబు, అనిల్‌కుమార్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, విద్యార్థిని ,విద్యార్థులు పాల్గొన్నారు.

# వివేకానంద కళాశాలలో ఓటరు అవగాహన సదస్సు

కరీంనగర్, సెప్టెంబర్ 5 (మనం న్యూస్)ః జిల్లా ఎన్నికల యంత్రాంగం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పిజి కళాశాలలో ఓటరు అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి 18 సంవత్సరాలు నిండిన తర్వాత విధిగా తమ పేరును ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో యువత పాత్ర కీలకమని తెలిపారు. ప్రతి విద్యార్థి ఓటు ప్రాముఖ్యతను తెలియపరుస్తూ సమాజాన్ని చైతన్యపరచాలన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్వీప్ నోడల్ ఆఫీసర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ మెప్మా రవీందర్ మాట్లాడుతూ, ప్రతి కళాశాలలో ఎలక్ట్రోరల్ లిటరసీ క్లబ్స్ ఏర్పరచుకొని, వివిధ కార్యక్రమాల ద్వారా భవిష్యత్, కొత్త ఓటర్ల నమోదుకు చర్యలు చేపట్టవచ్చన్నారు. అక్టోబర్ 1 2023 వ తేదీ వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఈ నెల 19వ తేదీ లోపుగా ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్, కళాశాల నోడల్ ఆఫీసర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం



అధికారి డాక్టర్ ఆర్.గోపికృష్ణ, ఏసిఓ సంపత్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కచ్చు సతీష్ కుమార్, ఎఓ శ్రావణ్ కుమార్, బి.రామేశ్వరరావు, అధ్యాపక బృందం, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పోషకాహార లోపం.. భవిష్యత్తుకు శాపం

## మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక



హుజురాబాద్ రూరల్, సెప్టెంబర్ 5 (మనం న్యూస్)ః భావి భారత పౌరులైన పిల్లలకు సరైన ఆహారం అందివ్వాలని, లేని పక్షంలో పోషకాహార లోపం వారి భవిష్యత్తుకు శాపంగా మారుతుందని హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక అన్నారు. మంగళవారం స్థానిక 16వ వార్డు లో పోషణ మాసోత్సవాలను పురస్కరించుకొని పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హాజరైన పిల్లల తల్లులకు, చిన్న పిల్లలకు పోషకాహార లోపం వలన కలిగే దుష్ప్రభావాల గురించి అంగన్ వాడీ టీచర్లు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో 15, 16వ వార్డు కౌన్సిలర్లు కళ్ళేపల్లి రమాదేవి, మారపల్లి సుశీల, వార్డు అధికారులు నూనె శంకరయ్య, జూపాక మొగిలి, అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# ఘనంగా టీచర్స్ డే..

## విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



తిమ్మాపూర్, సెప్టెంబర్ 5 (మనం న్యూస్)ః కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామంలో మంగళవారం మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధకృష్ణన్ చిత్రపటానికి పూలమాలు వేసి, నివాళులు అర్పించారు. బాలాజీ నగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేడి అంజయ్య, ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి, బాలాజీ నగర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు కోమల్ రెడ్డి, మన ఊరు-మన బడి సభ్యులు రావుల శ్రీనివాస్ గౌడ్, కొయ్యాడ తిరుపతి గౌడ్, ప్రధానోపాధ్యాయులు రవీందర్, బాలాజీ నగర్ లయన్స్ క్లబ్ సభ్యులు మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, రవీందర్ రెడ్డి, రాధకృష్ణన్, ఉపాధ్యాయులు పార్థసారథి, సునీత, మైపాల్ రెడ్డి, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయురాలుకు అవార్డ్



రామగిరి,సెప్టెంబర్ 05 మనం న్యూస్ ః రత్నాపూర్‌కు చెందిన రామగిరి మండలం చందనపూర్‌కు చెందిన స్కూల్ అస్సిటెంట్ ఉపాధ్యాయురాలు కొండు ప్రశాంతి రాణి మంగళవారం ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డ్ అందుకున్నారు. పెద్దపల్లి జెడ్పి చైర్మన్ పుట్ట మధుకర్,పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి,డిఇఓ మాధవి చేతుల మీదిగా అందుకున్నారు.

## సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన బాల్క సుమన్



రామకృష్ణాపూర్,సెప్టెంబర్ 05 (మనం న్యూస్): ప్రభుత్వ విప్,చెన్నూర్ ఎంఎల్ఏ బాల్క సుమన్ రామకృష్ణాపూర్ పట్టణంలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు అమరవాదికి చెందిన సౌజన్య,వెంకటేశం,అలేఖ్య లకు లక్ష ముప్పై వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందించారు.ఈ కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ జిలకర మహేష్,సాంబార్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



లక్సెట్టిపేట్, సెప్టెంబర్ 05(మనం న్యూస్): పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని విభాగాల విద్యార్థులు టీచర్స్ గా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు.ఆయా విభాగాల నుంచి ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు ఎంపిక చేశారు. ఈ టీచర్స్ డే వేడుకల బోధన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ ఓఝా పర్యవేక్షణలో జరిగింది.అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.గురుకుల బాలికల పాఠశాల/కళాశాలతో పాటు పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ ఓఝా, అధ్యాపకులు,బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## 61 వ సారి రక్తదానం చేసిన ఊట్కూరి రాధాకష్ణ రెడ్డి



కరీంనగర్,సెప్టెంబర్ 05( మనం న్యూస్): లయన్‌హెచ్ రాజిరెడ్డి , లయన్ ఏ. శివ ప్రసాద్ ల బర్త్ డే సందర్భంగా ఊట్కూరి రాధాకష్ణ రెడ్డి అత్యదికంగా 61సార్లు రక్తదానం చేసిన సందర్భంగా రాజిరెడి, శివ ప్రసాద్ ఘనంగా శాలువాతో సన్మానించారు.రాధాకష్ణ రెడ్డితోపాటు బొమ్మ పవన్ , బేతి మహేందర్ రెడ్డి , బండ రమణ రెడ్డి కి, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పి. కేశవ రెడ్డి , వైస్ చైర్మన్ చిదుర సురేష్ , స్టేట్ ఈ.సి మెంబెర్ పెద్ది విద్యా సాగర్ లకు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్య క్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ మెంబర్ ఇంజనీర్ కోల అన్నా రెడ్డి , మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎమ్ఎల్ఎన్ రెడ్డి , లయన్స్ క్లబ్ యెల్లల లక్మా రెడ్డి , లయన్స్ క్లబ్ రాగి శ్రీనివాస్ , లయన్స్ క్లబ్ లంబు సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.



## అభివృద్ధి చేశాం.... ఆదరించండి

### ఎమ్మెల్యే దివాకర్ రావు

లక్సెట్టిపేట్, సెప్టెంబర్ 5 (మనం న్యూస్)ః నియోజకవర్గంలో ప్రభుత్వం చేస్తోన్న అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని ఎమ్మెల్యే దివాకర్ రావు అన్నారు. మంగళవారం ఉదయం పట్టణంలోని 10వ వార్డులో స్థానిక కౌన్సిలర్, నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తోందన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా అత్యధిక సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో దూసుకెళుతుందని వివరించారు. రైతు బంధు, రైతు భీమా, ఉచిత విద్యుత్, కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్, ఆసరా, దళిత బంధు వంటి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచియన్నారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని తెలుసుకున్నారు. ఇంకా రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య,వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, బీ ఆర్ ఎస్ పట్టణాధ్యక్షుడు పాదం శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్ గోడిసేల లక్ష్మీ, కౌన్సిలర్స్ రాజన్న, మెట్టు కళ్యాణి రాజు, కో -ఆప్షన్లు వెంకటస్వామి గౌడ్,షాహిద్ అలీ,నాయకులు అంకతి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో రిటైర్డ్ ఉద్యోగుల సహకారం తీసుకుంటాం

### జిల్లా కలెక్టర్ డాః బి. గోపి




కరీంనగర్‌బ్యూరో, సెప్టెంబర్ 05( మనం న్యూస్): ప్రభుత్వానికి సేవలందించి పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సేవలను, సహకారాన్ని అభివృద్ధి పనుల్లో తీసుకుంటానని జిల్లా కలెక్టర్ డాః బి. గోపి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఇందిరానగర్ పెన్షనర్ భవన్ లో డాః సర్వేపల్లి రాదకృష్ణ జయంతి వేడుకలను పురస్కరించుకొని నిర్వహించిన గురుపూజోత్సవ వేడుకలలో జిల్లా కలెక్టర్ డాః బి. గోపి ముఖ్యఅతిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టే అభివృద్ధి పనులలో పదవి విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగుల( పించనుదారుల ) అనుభవాలను, సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటానని తెలిపారు. వృద్ధాప్యంలో వారి పిల్లల ఆదరణ కరువవ్వడం బాధాకరమైన విషయమని, వృద్దులు పిల్లలకు ఆస్థులు అప్పజెప్పి అనాథలుగా దిక్కులేని వారిగా ఉండకూడదని, చట్టంలో వారికి కల్పించబడిన హక్కులను, సౌకర్యాలు ఏంటి,వాటిని ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలనే విషయాలను గురించి ప్రతి ఒక్కరి తెలియజేసేలా అవగాహన కల్పించే బాధ్యత ప్రతిఒక్కరిదని, దానికి సంబంధించి పుస్తకాలను కూడా వృద్దులకు అందజేయాలని సూచించారు. చివరగా వివిధ రంగాలలో సేవలందించిన రిటైర్డ్ ఉద్యోగులను కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో బొద్దుల లక్ష్మయ్య, కట్ట వేణుగోపాల్, కట్ట ఆనందం, రామచంద్రం, సుదర్శన్, రామస్వామి ఇతర రిటైర్డు ఉద్యోగులుతదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు ఘన సన్మానం

కరీంనగర్,సెప్టెంబర్05 (మనంన్యూస్)మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని, పురస్కరించుకొని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విజయ పురిలోని అందుల పాఠశాలలోని, పదిమంది ఉపాధ్యాయులకు మంగళవారం రాజరాజేశ్వరి లైన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు .విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు బి.సరళ, అశోక్ రావు, డి సి యోగరాళ్ల ,బండి శంకర్ ,ప్రసాద్ రెడ్డి, ఉపాధ్యక్షులు నరహరి లక్ష్మారెడ్డి, కర్ర విద్యాసాగర్ రెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడానికి.. భారీగా హైదరాబాద్‌కు తరలిన గులాబీ శ్రేణులు

మంచిర్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 5 (మనం న్యూస్)ః ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు వైఖరిని నిరసిస్తూ బిఆర్ఎస్‌కు రాజీనామా చేసిన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు మంగళవారం భారీ సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ముందుగా మాజీ ఎమ్మెల్సీ, ఎఐసిసి సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు నివాసం నుండి 150 వాహనాలతో బయలుదేరారు. అమరవీరుల స్థూపానికినివాళులర్పించి హాజీపూర్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి భారీ వాహన శ్రేణితో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో హాజీపూర్ జడ్పిటిసి సభ్యులు పుస్కూరి శిల్ప, హాజీపూర్ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు శ్రీనివాసరావు, మాజీ జెడ్పిటిసి సభ్యులు రాచకొండ ఆశాలత వెంకటేశ్వరరావు, హాజీపూర్ మాజీ






ఎంపిటిసి సభ్యులు బొడ్డు శైలజ శంకర్, హాజీపూర్ మండల బిఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు దొమ్మాటి సత్తయ్య, వేంపల్లి మాజీ సర్పంచ్ గోనె సంజయ్, సీనియర్ న్యాయవాది, తెలంగాణ ఉద్యమకారుడు నాయకుడు సిరిపురం శ్రీనివాస్, ఉప సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవరపు జితేందర్ రావు, మాల సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ తాజా మాజీ పట్టణ అధ్యక్షుడు సాగే సుమోహన్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బెల్లంకొండ మురళీధర్ , సంగతి మురళి, చిలువేరు నాగేశ్వరరావు, తదితరులు దాదాపు 500 మంది నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. వీరంతా ప్రేమ్ సాగర్ రావు నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారు.

# ఈ విశ్వంలో ఎన్ని వృత్తులు ఉన్నప్పటికి ఉపాధ్యాయ వృత్తికి ఒక ప్రత్యేక స్థానం ఉంది

## కరెస్పాండెంట్ ఫాదర్ అశోక్‌రెడ్డి



సుల్తానాబాద్,సెప్టెంబర్ 05 మనం న్యూస్ : ఉపాధ్యాయ దినోత్సవాన్ని సుల్తానాబాద్ పురస్కరించుకొని సెయింట్ మేరీష్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఫాదర్ తుమ్మ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ సంబరాలు అంబరాన్ని అంటేలా నిర్వహించారు.ఈ సందర్భంగా ఫాదర్ అశోక్ మాట్లాడుతూ ఈ విశ్వంలో ఎన్ని వృత్తులు ఉన్నప్పటికీ ఉపాధ్యాయ వృత్తికి ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. గౌరవనీయమైన వృత్తిలో ఉంటూ ఎంతోమంది జీవితాలను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను గౌరవించేందుకు మనం ప్రతి సంవత్సరం ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నాం అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవ ప్రత్యేక వివరిస్తూ ఒక గురువుగా ఎందరో విద్యార్థులను తీర్చిదిద్ది భారత రాష్ట్రపతిగా అత్యున్నత స్థానానికి చేరుకున్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజు సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటాం అని వివరించారు. శిష్యుల ఎదుగుదలే తమ ప్రథమ కర్తవ్యంగా భావించే గురువులందరికీ ఉపాధ్యాయ దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు,ఉపాధ్యాయేతర సిబ్బందిని ప్రత్యేకంగా శాలువాలతో సత్కరించి,బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఫాధర్ వినయ్,ఉపాధ్యాయులు,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు,ఉపాధ్యాయులు ఆడిపాడి చూపరులని అలరించారు.







## యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం

ముత్తారం,సెప్టెంబర్ 05 మనం న్యూస్ : ముత్తారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మాజీమంత్రి మంథని శాసనసభ్యులు ఏఐసిసి కార్యదర్శి దుద్దిల్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మాంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముత్తారం మండల అధ్యక్షులు దొడ్డ బాలాజీ,అడవిశ్రీరాంపూర్ ఎంపిటిసి దొడ్డ గీత రాణి,యువజన కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు చొప్పరి సది,యువజన కాంగ్రెస్ యూత్ నాయకులు సంగెం వంశీ,బైరి రాజు,సాదా స్వామి,భోగం విజయ్, బందెల కుమార్,చొప్పరి రాకేష్,చొప్పరి రంజిత్,నిరటి అంజి,కలల పవన్,తుమ్మల వెంకటేష్,కుక్కల సంతోష్,మెట్టు రాకేష్,శీల సంతోష్, సీనియర్ నాయకులు జంగ సమ్మయ్య,మూగ రవీందర్,కలవేన సది, కుక్కల మల్లేష్,చొప్పరి రాజయ్య, తుమ్మల సది,మాదాసి రవి, తదితరులు పాల్గొన్నారు.

## పోతారంలో మత్స్యశాఖ మార్కెటింగ్ సొసైటి సహకార సంఘం ఏర్పాటుకు

### - ప్రొసిడింగ్ పత్రము అందజేసిన పుట్ట మధుకర్



ముత్తారం,సెప్టెంబర్ 05 మనం న్యూస్ : ముత్తారం మండలంలోని పోతారం గ్రామానికి చెందిన మత్స్యకారులు మత్స్యశాఖ మార్కెటింగ్ సోసైటి కోసం దరఖాస్తు చేసుకోగా మంజురైన ప్రోస్టింగ్ పత్రాన్ని పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ చేతుల మీదుగా పోతారం గ్రామానికి చెందిన మత్స్యకారులకు అందజేశారు. అనంతరం మత్స్యశాఖ సంఘం సభ్యులు అడుగగానే సొసైటి సంఘం ఏర్పాటుకు సహకరించిన పుట్ట మధుకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జక్కుల ముత్తయ్య,జెడ్‌పిటిసి చెలుకల స్వర్ణలత అశోక్,ఎంపిటిసి బియ్యాని శ్యామల సదానందం,పోతారం సర్పంచ్ నెత్తెట్ల మహేందర్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి ఎంతో ముఖ్యమైనది




సుల్తానాబాద్,సెప్టెంబర్ 05 మనం న్యూస్ : సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని సుల్తానాబాద్ వివేకానంద పాఠశాలలో మంగళవారం ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డైరెక్టర్ భూసార రవీందర్ హాజరై అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి ఎంతో ముఖ్యమైనదని తను పిల్లలకు తెలియపరిచారు.అలానే పాఠశాలలో నిధులు నిర్వహిస్తున్న అధ్యాపక బృందానికి ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సుజాత,ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి,కాలేజ్ ప్రిన్సిపాల్ చందు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఐపిఎస్ పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

### ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



సుల్తానాబాద్,సెప్టెంబర్ 05 మనం న్యూస్ : సుల్తానాబాద్ పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయుల దినోత్సవం,ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాటేటి సంజీవ్ కుమార్,ప్రిన్సిపాల్ కృష్ణప్రియా మాట్లాడుతూ దేశ తొలి ఉపరాష్ట్రపతి,రెండవ రాష్ట్రపతిగా సర్వేపల్లి రాధాకృష్ణ సేవలందించారని గుర్తు చేసుకున్నారు. ఆయన జన్మించిన సెప్టెంబర్ 5వ తేదీని దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. తన పుట్టిన రోజును వేరుగా జరిపే బదులు,ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహిస్తే తానెంతో గర్విస్తానని చెప్పిన సర్వేపల్లి ఉపాధ్యాయ వృత్తి పట్ల తన ప్రేమను చాటారన్నారు. అదేవిధంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. చిన్నారులందరు రాధాకృష్ణ వేషధారణలో కలకలలాడుతూ కార్యక్రమానికి వన్నె తెచ్చారు. విద్యార్థులందరూ ఎంతో ఉత్సహంతో ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కలిగి ఉండాలి



సుల్తానాబాద్,సెప్టెంబర్ 05 మనం న్యూస్ : విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కలిగి ఉండాలని సుల్తానాబాద్ కేరళ మోడల్ హైస్కూల్ కరస్పాండెంట్ సీజ్జు ఎస్ నాయర్ అన్నారు. సాధారణ ఎన్నికల ప్రక్రియ విధానాన్ని తెలియజేసేలా మంగళవారం సుల్తానాబాద్ పట్టణంలోని కేరళ మోడల్ హైస్కూల్ విద్యార్థులకు ఎన్నికలను నిర్వహించారు. విద్యార్థులకు గుర్తులు కేటాయించి బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటింగ్ ప్రక్రియ నిర్వహించారు. సాధారణ ఎన్నికల ప్రక్రియ విధానాన్ని ఏ మాత్రం తీసిపోకుండా విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సిజ్జు ఎస్.నాయర్ మాట్లాడుతూ భారత ప్రజాసామ్య వ్యవస్థలో ఎన్నికలు ముఖ్యమైనవనీ,విద్యార్థులకు ఎన్నికలు,ఓటు హక్కుపై అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో స్కూల్ లీడర్,డిప్యూటి లీడర్,స్పోర్ట్స్ సెక్రటరీ,పర్యావరణ సెక్రటరీ,ఆర్ట్స్ క్లబ్ సెక్రటరీ పదవులకు ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. పోటీ చేసిన విద్యార్థులు తమ కేటాయించిన గుర్తులను ప్లే కార్డులో ప్రదర్శిస్తూ విద్యార్థులను ఓటు అడిగే విధానం పలువురు ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ స్మిత,ఎస్. నాయర్, ఉపాధ్యాయులు రాజయ్య, కిరణ్,అలీ, రామచంద్రం, సంధ్య,అజయ్,పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# మనం నిజామాబాద్ కామారెడ్డి



## మభ్యపెట్టే హామీలిచ్చే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి

### -మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

భీంగల్, సెప్టెంబర్ 5 (మనం న్యూస్): మభ్యపెట్టే హామీలతో వస్తున్న వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలో మంగళవారం రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పలు అభివద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా బాల్కొండ మండలం బోదెపల్లి గ్రామంలో బోదెపల్లి అప్రోచ్ బిటి రోడ్ 1కోటి రూపాయలతో సింగిల్ లైన్ నుండి డబుల్ రోడ్ గా మార్చు పనుల శంకుస్థాపన,వన్నెల్ బి గ్రామంలో లింక్ రోడ్, వెంపల్లి రేంజర్ల న్యూ ఫార్మేషన్ రోడ్డు, కోటి వ్యయంతో చేపట్టే పనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో పలు అభివద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రేంజర్ల నుండి షెట్పల్లి వన్నెల్ బి వయా డంపింగ్ యార్డ్ న్యూ ఫార్మేషన్ రోడ్ 2.80 కోట్ల వ్యయంతో చేపట్టే పనుల శంకుస్థాపన, కొమురం భీమ్ విగ్రహ ఆవిష్కరణ,హెల్త్ సబ్ సెంటర్ ప్రారంభోత్సవం,మహిళ బిల్డింగ్ ప్రారంభోత్సవం,సొసైటీ భవనం ప్రారంభోత్సవం కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. పలు అభివద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి వచ్చిన మంత్రికి ఆయా మండలాల ప్రజలు మంగళ హారతులతో, డప్పు చప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి వేముల మాట్లాడుతూ కేసీఆర్ తోనే తెలంగాణ పదిలమని, ఆయన నాయకత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష అన్నారు. అమలుకు నోచుకోని హామీలు కేసిఆర్ ఇవ్వడని,పేద ప్రజలకు అక్కరకు వచ్చే పనులు చేస్తారన్నారు. తెలంగాణ అభివృద్ధి ఓర్వని బీజేపీ వాళ్ల పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ పథకాలు ఎందుకు లేవని ప్రశ్నించారు. స్థానిక ఎంపి బాండ్ పేపర్ రాసిచ్చి పసుపు రైతులను మోసం చేశారన్నారు. కాంగ్రెస్, బీజేపీల మోసపు మాటలు నమ్మి ప్రజలు ఆగం కావొద్దని కోరారు.

## ఈవిఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్



నిజామాబాద్, ఆగస్టు 5 (మనం న్యూస్): స్థానిక వినాయకనగర్ లోని ఈవిఎం గోదాంను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్ లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను పరిశీలించారు. పోలీసు భద్రత, అగ్నిమాపక సిబ్బంది విధులు నిర్వహిస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పవన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థి జీవితాన్ని మలుపు తిప్పేది ఉపాధ్యాయులే

### శాసన సభాపతి పోచారం శ్రీనివాస రెడ్డి

నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 5 (మనం న్యూస్): సమాజానికి ఉపయోగపడే విధంగా విద్యార్థులను తయారు చేసేది ఉపాద్యాయులేనని అందుకే గురువుకు సమాజంలో అత్యుత్తమ స్థానముందని శాసన సభాపతి పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో జరిగిన జిల్లా స్థాయి గురుపూజోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానం ఏదైనా అందరికీ మార్గదర్శకులు






గురువులేనన్నారు. తాము కూడా ఒకనాడు విద్యార్థులమే అని, విద్య నేర్పిన గురువుల వలనే జ్ఞానం, విలువలు అబ్బాయన్నారు. తాను తొమ్మిదో తరగతి చదువుతున్నప్పుడు సర్వేపల్లి రాధాకృష్ణన్ రాష్ట్రపతి హోదాలో నిజామాబాద్‌కు రాగా, స్కూల్ ఎగ్గొట్టి ఆయన సభకు వెళ్ళామని పోచారం గుర్తు చేశారు. రాష్ట్రపతిని గౌరవించి జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నది మన దేశంలోనే అన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను శ్రీనివాస్‌రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ శాసనసభ్యులు హన్మంత్ షిండే, కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గర్భంలోనే బిడ్డను అమ్మకానికి పెట్టిన మహాతల్లి

### మగబిడ్డకు లక్షన్నర, ఆడబిడ్డకు లక్ష ధరతో విక్రయించే యత్నం

### పోలీసులకు చిక్కి కటకటాల పాలు

నిజామాబాద్, సెప్టెంబర్ 5 (మనం న్యూస్): సమాజంలో మానవ సంబంధాలు రోజురోజుకు క్షీణించిపోతున్నాయి. తల్లిదండ్రి, కూతురు, కొడుకు, అన్నదమ్ములు అన్న అనురాగాలు మచ్చుకైన కనిపించని సమాజంలో ప్రస్తుతం మానవాళి బతుకులీడవాల్సిన దుస్థితి దాపురించింది. నిజామాబాద్ నగరంలో చోటు చేసుకున్న ఘటన ఈ విషయాన్నే కళ్ల ముందుంచుతోంది. గర్భంలో ఉన్న శిశువును విక్రయించేందుకు ధర నిర్ణయించిందో మహా తల్లి. మగబిడ్డ పుడితే లక్షన్నర, ఆడ శిశువు జన్మిస్తే లక్ష రూపాయల రేటు చెప్పి, ఐదు వేల రూపాయల అడ్వాన్స్ తీసుకుని మాతృత్వానికి మరో పేరు పెట్టిందో మహిళ. పోలీసులు కథనం ప్రకారం... నగరంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన గోసంగి దేవి(33) అనే మహిళ గర్భంతో ఉంది. తనకు పుట్టబోయే బిడ్డను పోషించే స్తోమత లేదన్న సాకుతో కడుపులో ఉన్న బిడ్డను అమ్మకానికి పెట్టింది. దుబ్బ ప్రైమరీ హెల్త్ సెంటర్ లో పనిచేస్తున్న సలోంకే జయకు(38) ఈ విషయం తెలిపింది.






సదరు మహిళ తాను నివసించే కాలనీకి చెందిన హుమేరా బేగం(36), షబానా బేగం(33)లకు తెలియజేసింది. వారు దేవిని సంప్రదించగా మగ బిడ్డ పుడితే లక్షన్నర రూపాయలు, ఆడబిడ్డ పుడితే లక్ష రూపాయలు ఇస్తామని ఒప్పందం కుదుర్చుకొన్నారు. దానికి అడ్వాన్సుగా ఐదువేల రూపాయల చొప్పున అందించారు. ఇదిలా ఉండగా, గత రెండు రోజుల క్రితం స్థానిక శైలజ ఆసుపత్రిలో దేవి మగ బిడ్డను ప్రసవించింది. డెలివరీ సందర్భంగా ఆయిన ఖర్చు 20 వేలు షబానా బేగం చెల్లించింది. అయితే మరో మహిళ హుమేరా బేగంకు కూడా పుట్టిన బిడ్డను ఇస్తానని దేవి మాట ఇచ్చి అడ్వాన్సు పుచ్చుకుని ఉండడంతో గొడవ జరిగింది. సోమవారం అంబేద్కర్ కాలనీలోని రాధాకృష్ణ టాకీస్ వద్ద నలుగురు మహిళలు గొడవ పడుతుండగా స్థానికులు గమనించి 3వ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నలుగురు మహిళలను స్టేషన్ కు తరలించారు. వారి వద్ద నుండి రెండు సెల్ ఫోన్లు, రెండు వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు.బిడ్డను అమ్మకానికి పెట్టిన దేవి, మధ్యవర్తిత్వం వహించిన పిహెచ్ సి ఉద్యోగి జయ,బిడ్డను కొనడానికి ప్రయత్నించిన షబానా బేగం, హుమేరా బేగం లపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు 3వ టౌన్ ఎస్ఐ ఎల్ ప్రవీణ్ తెలిపారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

బోధన్, సెప్టెంబర్ 5 (మనం న్యూస్): స్థానిక అజాంగంజ్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే సతీమణి ఆయేషా ఫాతిమా పుట్టిన రోజు సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ఇచ్చిన మాట ప్రకారం విద్యార్థిని విద్యార్థులకు బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విఆర్ దేశాయ్,పాలకవర్గం ఆధ్వర్యంలో పుస్తకాలు,పలకలు పండ్లు పంపిణీ పంచారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ బోధన్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్,బోధన్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బెంజర్ గంగారం, కౌన్సిలర్ సత్యం, డేగవత్ ధూప్ సింగ్ నాయక్, నాయకులు అశోక్ రెడ్డి, నాగాన్ పల్లి మధు, శంకర్ గౌడ్, మొహమ్మద్ ,సూర్య వెంకటేష్, శంకర్, నాగుల రవిశంకర్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ షకీల్, డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఓటమికి భయపడే మాపై విమర్శలు

**షకీల్ ఓడిపోతానని తెలిసే కెసిఆర్‌ని చూసి ఓటేయ్యాలంటున్నారు**

**కాకి లెక్కలతో ప్రజల్ని మభ్యపెడుతున్నారు**

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రకాష్ రెడ్డి**

బోధన్, సెప్టెంబర్ 5 (మనం న్యూస్): బోధన్ నియోజకవర్గంలో తన ఓటమి డిసైడ్ అయింది కాబట్టే ఎమ్మెల్యే షకీల్ నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్ రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ తొమ్మిదేళ్ల కాలంలో బోధన్ నియోజకవర్గానికి ఎమ్మెల్యే షకీల్ ప్రత్యేకంగా ఒరగబెట్టింది ఏమీ లేదని, తొమ్మిదేళ్ల క్రితం బోధన్ ఎట్లా ఉందో ఇప్పుడు అట్లానే ఉందన్నారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు వచ్చినట్టే బోధన్ కు నిధులు వచ్చాయని, ప్రజలను మోసం చేయడానికి ఎమ్మెల్యే కాకమ్మ కబుర్లు చెబుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు అభివృద్ధి గురించి నిలదీస్తారనే భయంతోనే తనను చూసి కాదు కేసీఆర్ ముఖం చూసి ఓటేయమంటూ అభ్యర్థిస్తున్నారని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో బిజెపి వరుస కార్యక్రమాలతో పుంజుకోవడం చూసి భయపడిన షకీల్ బిజెపి నాయకులను,పార్టీని టార్గెట్ చేసి వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారన్నారు. బిజెపిలో తన సహచరుడు మోహన్ రెడ్డి గానీ, తాను గానీ కష్టపడి రూపాయి రూపాయి కూడా బెట్టుకుని ఈ స్థాయికి ఎదిగామని ప్రకాష్‌రెడ్డి స్పష్టం చేశారు. అడ్డదారుల్లో సంపాదించిన షకీల్ కు తమను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. బోధన్ నియోజకవర్గంలో మండలానికి ఒక ఎమ్మెల్యే ఉన్నాడని




రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు వీళ్ళని కట్టగట్టి కందకుర్తి నదిలో పడేయాలన్నారు. మూడుసార్లు కాంగ్రెస్ పార్టీకి, రెండుసార్లు బిఆర్ఎస్ కు అవకాశం ఇచ్చిన బోధన్ నియోజకవర్గ ప్రజలు, ఈ సారి తప్పకుండా బిజెపిని గెలిపించాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల అనంతరం ల్యాండ్ మాఫియా, సాండ్ మాఫియా నుండి బోధన్ ప్రజలకు శాశ్వతంగా విముక్తి కలిగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, బోధన్ అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, వివిధ మండలాల అధ్యక్షులు కొలిపాక బాలరాజు, మనోహర్, సరిన్, ఇంద్రకరణ్, గోపికృష్ణ, ప్రవీణ్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ యోగేష్, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల దృష్ట్యా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

**నాలుగు షిఫ్టుల్లో విధులు నిర్వహణ**

**ఏమైనా సమస్యలుంటే 7995070699 నెంబర్‌కు ఫోన్ చేయాలి**

**అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్**



పెద్దపల్లి, సెప్టెంబర్-05(మనంప్రతినిధి)భారీ వర్షాల దృష్ట్యా సమీకృత జిల్లా కలెక్టరేట్ లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని అదనపు కలెక్టర్ జి. వి.శ్యాంప్రసాద్‌లాల్ తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా 24/7కంట్రోల్ రూంను కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఏమైనా సమస్యలుంటే కంట్రోల్ రూం నంబర్ 7995070699గల నంబర్‌కు ప్రజలు ఫోన్ చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. కంట్రోల్ రూంలో నాలుగు షిఫ్టులలో ఉద్యోగులు 24గంటల పాటు విధులు నిర్వహిస్తున్నారని, ప్రజల నుండి ఫోన్ కాల్ ద్వారా వచ్చే సమాచారం సంబంధిత అధికారులకు అందిస్తారని, ఏమైనా సమస్యలుంటే ప్రజలు కంట్రోల్ రూంనంబర్‌కు ఫోన్ చేయాలని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ తెలిపారు.

# విద్యాబోధనతో పాటు వ్యక్తిత్వ నిర్మాణంపై శ్రద్ధ వహించాలి

**విద్యాలయాల్లో మౌలిక వసతులకల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత**

**జిల్లాలో ఉపాధ్యాయుల కృషితోనే మెరుగైన ఫలితాలు**

**ప్రాథమిక విద్యలో అద్భుత ఫలితాలు**

**ఉత్తమ సేవలు అందించిన 44మంది ఉపాధ్యాయులకు సన్మానం**

**జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్**

పెద్దపల్లి, సెప్టెంబర్-05(మనం ప్రతినిధి): విద్యార్థులకు విద్యా బోధనతో పాటు వ్యక్తిత్వ నిర్మాణంపై శ్రద్ధ వహించాలని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రఘువీర్‌సింగ్ లతో కలిసి పాల్గొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈసందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ మాట్లాడుతూ జీవితంలో ఎదగడానికి తన తల్లిదండ్రులు, గురువులు నేర్పిన విద్యాబుద్ధులు కారణమని, వారికి ఎల్లప్పుడూ కృతజ్ఞతతో ఉంటానని అన్నారు. ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తూ రాష్ట్రపతి హోదా వరకు ఎదిగిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం పురస్కరించుకొని ఉపాధ్యాయుల దినోత్సవం ఘనంగా నిర్వహించుకుంటామని, మారుమూల ప్రాంతాలలో విద్యార్థులను సైతం అద్భుతంగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు అనేకమంది ఉన్నారని జడ్పీ చైర్మన్ తెలిపారు. విద్యార్థులకు చదువు కేవలం ఉపాధి కోసం మాత్రమే కాకుండా మన వ్యక్తిత్వాన్ని మార్చేందుకు, సమాజంలో మనకు ఎదురయ్యే సమస్యలను ధృడంగా ఎదుర్కొనేందుకు విద్య ఉపయోగపడాలని అన్నారు. విటమిన్ డి లోపించకుండా విద్యార్థుల ఆరోగ్యంపై సైతం శ్రద్ధ వహించాలని, చదువుతోపాటు క్రీడలలో సైతం విద్యార్థులు పాల్గొనే దిశగా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని జడ్పీ చైర్మన్ సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ మాట్లాడుతూ గత సంవత్సర కాలంలో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రభుత్వ పాఠశాలలో ఎన్రోల్మెంట్, వినూత్న రీతిలో విద్యా బోధనతో మంచి ఫలితాలు సాధించడం వంటి అనేక పరిమాణాలను దృష్టిలో ఉంచుకుని 44మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా సన్మానించుకుంటున్నామని అన్నారు. తొలిమెట్టు కార్యక్రమం ద్వారా ప్రాథమిక విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు మెరుగు పరిచే దిశగా మన జిల్లాలో ఉపాధ్యాయులు అద్భుత ఫలితాలు సాధించారన్నారు. మన ఊరు మనబడి కార్యక్రమం ద్వారా జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో మౌళిక వసతులు ఏర్పాటు చేశామని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన మంచి ఫలితాలు సాధిస్తున్నామని, భవిష్యత్తులో సైతం ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతూ మరిన్ని మెరుగైన ఫలితాలు సాధన దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని అదనపు కలెక్టర్ అరుణశ్రీ సూచించారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ గొప్ప పండితుడు దేశ మొదటి ఉప రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సందర్భంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకోవడం సంతోషకరమని అన్నారు. ప్రభుత్వ విద్యాబోధనలో నాణ్యత గణనీయంగా పెరిగిందని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారి విద్యా సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్న తీరు ప్రశంసనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లాలోని 22 పాఠశాలలో విజ్ఞాన కేంద్రాలుగా మినీ గ్రంథాలయాలను ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో విద్యార్థుల ఎన్రోల్మెంట్ ఎక్కువగా ఉన్న ప్రతి పాఠశాలలో మినీ గ్రంథాలయాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి డి. మాధవి మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ వృత్తిలో రాణించాలంటే వృత్తి పట్ల శ్రద్ధ, విద్యార్థులకు సులువుగా చేరవేసే విధంగా కమ్యూనికేషన్స్ స్కిల్స్ అలవర్చుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో డిసిఇబి కార్యదర్శి వి.హన్మంతు, ఎసిజిఇ ఎం రాంరెడ్డి, సమగ్ర శిక్ష సమన్వయకర్తలు జ్యోత్స్నలత, పిఎంషేక్, విజయ్‌కుమార్, మల్లేష్ గౌడ్, జిల్లా సైన్స్ అధికారి వి.రవినందన్‌రావు, మండల విద్యాధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓటు ప్రాముఖ్యతపై పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు

**ప్రతి పాఠశాలలో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ను ఏర్పాటు చేయాలి**

**ట్రాన్స్ జెండర్‌లు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలి**

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ**



పెద్దపల్లి, సెప్టెంబర్-05(మనం ప్రతినిధి): ఓటు ప్రాముఖ్యతపై ప్రతి పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని స్థానికసంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. మంగళవారం సమీకృత సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులకు స్వీప్ ఆక్టీవిటీస్ నిర్వహణపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ వివరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటరుగా నమోదు చేసే విధంగా ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతి పాఠశాలలో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లు ఏర్పాటు చేసి ఓటు ప్రాముఖ్యతపై విద్యార్థులకు వివరించాలని, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఎన్నికల కమీషన్ మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ పకడ్బందీగా ఓటు ప్రాముఖ్యత కార్యక్రమాలు జరపాలని అదనపు కలెక్టర్ తెలిపారు. అంతకుముందు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ట్రాన్స్ జెండర్‌లతో సమావేశం ఏర్పాటు చేసి ఓటరు జాబితాలో అక్టోబర్ 1-2023నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరూ తమ పేరు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అన్నారు. జిల్లాలో 55ట్రాన్స్ జెండర్‌లు ఉండగా 22 మందికి ట్రాన్స్ జెండర్‌లకు సర్టిఫికెట్‌లు ఉన్నాయని తెలుపగా, మిగిలిన వారిని సైతం సర్టిఫికెట్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆధార్‌కార్డులేని వారు ముందస్తుగా ఆధార్ కార్డు పొందాలని, అనంతరం ఓటర్ నమోదు కోసం దరఖాస్తు చేయాలని, దీని కోసం గోదావరిఖనిలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాట్లు చేసామని తెలిపారు. ఈసమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, స్వీప్ ఆక్టివిటీస్ జిల్లా నోడల్ అధికారి రౌఫ్‌ఖాన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తోట రాజుకు రవీంద్రభారతిలో ఘన సన్మానం

జమ్మికుంట, సెప్టెంబర్ 5 (మనం న్యూస్): జమ్మికుంట మండలంలోని తనుగుల గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు తోట రాజు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, విద్యా సంచాలకులు దేవసేన చేతుల మీదుగా అవార్డు అందించి, ఘనంగా సన్మానించారు. రాజు తన తోటి ఉపాధ్యాయులు సమాజ భాగస్వామ్యంతో పాఠశాలను అభివృద్ధి పరిచి, విద్యార్థుల సంఖ్యను పెంచిన విధానాన్ని వారు మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా తోట రాజు పాఠశాల అభివృద్ధికి తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డును తమ తల్లిదండ్రులకు అంకితం ఇస్తున్నట్లు తెలిపారు.

